వరాహాల స్వైర విహారం

- పెద్దాపురంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు
- తూతూమంత్రంగా నియంత్రణ చర్యలు
- వ్యాధులపై ఆందోళనలో ప్రజలు
- మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి



పెద్దాపురం పట్టణంలో సంచరిస్తున్న పందులు

పెద్దాపురం: ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడినప్పుడే మున్సిపల్ అధికారులకు పరిశుభ్రత, పారిశుధ్యం గుర్తుస్తోంది. నిత్యం పట్టణంలో రద్దీగా ఉండే జనవాసాల మధ్య పందులు స్వైర్య విహారం చేస్తున్నా మున్సిపల్ పారిశుధ్య యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరిస్తోంది. పెద్దాపురం పట్టణంలో ఏళ్ల తరబడిగా సీజనల్ సమయంలో పట్టణానికి ఏదో మూల ప్రాంత ప్రజలను డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలుతూనే ఉంటాయి. అయితే ఆ సమయంలో అధికారులు మందుస్తు చర్యలు చేపడతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప వాటిపై చర్యలు తీసుకోవడం లేదనడానికి ఈ పందుల స్వైరవిహారమే నిదర్శనం. ఇటీవల పట్టణంలో పందుల నిర్మూలన చేస్తున్నామని హామీలిచ్చారే తప్ప ఆచరణ అంతంత మాత్రంగానే కనిపించాయి. పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేశామని ఇదిగో ఇదిగో అంటూ కాలయనాపన చేస్తున్నారే తప్పా ప్రభుత్వం సరైన జీవో జారీ చేసినా పట్టణంలో పందుల నిర్మూలనపై చర్యలు చేపట్టిన దాఖల్లాలేవు.

షరా మామూలే...!

గతంలోనూ ప్రస్తుతం పెద్దాపురం ఫేస్‌బుక్, ఆల్ ఈజ్ వెల్ గ్రూపుల్లో పందుల స్వైర విహారంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను నిలదీయాలని మెసెజ్‌లు పంపించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వాటిపై దృష్టి సారించిన పాపన పోలేదు. పందులు వల్లే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పట్టణానికి దూరంగా ఉంచాలని పందుల యజమానులకు హుంకుం జారీ చేసినా మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. పందుల సంచారం వల్ల ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టణంలో పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోగాల పాలవుతున్నాం



పందుల స్వైర విహారం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఏ మూల చూసినా పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలంటే అధికారులు కాల యాపన చేస్తున్నారు గానీ, వాటి కోసం పట్టించుకోవడంల లేదు.
– **తాడి కస్తూరి**, గృహిణి, నాగంపేట, పెద్దాపురం

అప్రమత్తంగా ఉండాలి



పట్టణంలో డెంగీ వ్యాధి ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పట్టణంలో పందుల సంచారం ఉన్న అపరిశుభ్ర వాతావరణ లేకుండా చూసుకోవాలి. డెంగీపై అనుమానం ఉన్నట్టయితే వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. – **డాక్టర్ సూర్యకుమారి**, ఏరియా ఆసుపత్రి వైద్యురాలు, పెద్దాపురం

నోటీసులు ఇచ్చాం



పందుల యజమానులకు నోటీసులు ఇచ్చాం. అయినా పందుల సంచారంపై సిబ్బందికి పూర్తి ఆదేశాలిచ్చాం. వెంటనే పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. ఇకపై శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– **కె.వి.పద్మావతి**, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రిజిస్ట్రేషన్లు



సామర్లకోటలో సోలార్‌కు ఎస్సీ, ఎస్టీల పేర్ల రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈ తదితరులు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు సోలార్ పథకం అమలు చేయడానికి అర్హులకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. స్థానిక 13వ వార్డు రామాలయం వద్ద ఎపీఈపీడీసీఎల్ ఏఈ పి.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన 1400 మంది అర్హులు ఉన్నట్టు ప్రభుత్వం నుంచి లిస్టు వచ్చిందన్నారు. వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. అయితే వీరికి ప్రభుత్వం నుంచి సోలార్ కిట్లు విషయంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, ట్రాన్సుకో సిబ్బంది పాల్గొన్నారు.

భేతాళస్వామి ఆలయంలో నవరాత్ర ఉత్సవాలు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో ఉన్న భేతాళస్వామి ఆలయంలో వచ్చే నెల మూడో తేదీ నుంచి 13 వరకూ నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, పారాయణలు జరుగుతాయన్నారు. చివరి రోజున సంబరం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. కుతుకుడుమిల్లి పోస్టాఫీసు వీధిలో ఏర్పాటు చేసిన గణపతి మందిరం వద్ద రామ్ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో భారీఅన్న సమారాధనలు నిర్వహించారు. కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోటారు సైకిలిస్టు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మోటారుసైకిలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న పిఠాపురం మండలం చేబ్రోలుకు చెందిన వ్యక్తి కాకినాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపై ఉన్న గొయ్యిని గమనించకపోవడంతో మోటారుసైకిలు గొయ్యిలో పడింది. దాంతో మోటారు సైకిలిస్టు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. గంట గడచినా 108 రాకపోవడంతో స్థానికులు ప్రైవేటు వాహనంలో అతనిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుని వివరాలు తెలియవలసి ఉంది.

సామర్లకోటలో ‘ఇది మంచి ప్రభుత్వం’



సామర్లకోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: స్థానిక 3వ వార్డు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అధ్యక్షత వహించగా తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత పాల్గొన్నారు.

13 మంది అరెస్ట్

కిర్లంపూడి: కోడి పందేలు ఆడుతున్న 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని వేలంకలో కోడి పందేలు ఆడుతున్నట్టు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో శనివారం తెల్లవారు జామున స్థానిక ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో కోడి పందేల శిబిరంపై దాడి చేశారు. 13 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.14,180, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

భక్తి భావాన్ని పెంచుకోవాలి



గొర్సలో అన్న సమారాధనలో పాల్గొన్న గీత

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ భగవంతునిపై భక్తిభావాన్ని పెంచుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని గొర్సలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్నదానంలో ఆమె పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, నాయకులు తదితరలు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు ఇన్నకోట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, రోగులకు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. అవసరమైన వారికి మందులు అందజేస్తామని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

- 44 ఎద్దులు, ఒక కంటైనర్ స్వాధీనం
- నలుగురు వ్యక్తులు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కంటైనర్‌లో ఎద్దులు

పిఠాపురం: గోవుల అక్రమ రవాణాను శనివారం గొల్లప్రోలు పోలీసులు అడ్డుకున్నారు. గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకుని 44 ఎద్దులు, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...కంటైనర్‌లో గోవులను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒక కంటైనర్‌లో గుట్టుచప్పుడు కాకుండా 44 ఎద్దులను విశాఖపట్నం నుంచి చిలకలూరిపేట తరలిస్తుండగా పట్టుకున్నారు. కంటైనర్, ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. వాటిన తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు.

చేబ్రోలులో బాలికకు డెంగీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డి.దుర్గాభవాని అనే బాలికకు డెంగీ సోకినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో గొల్లప్రోలు వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య సేవలందిస్తున్నారు. డెంగీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ముందు జాగ్రత్తగా వైద్య సేవలందిస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ అహ్మద్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాల్లో వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలో ప్రతి రోజు 30 కుటుంబాలను సందర్శించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినొద్దని ప్రజలకు సూచించారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- మంత్రి కందుల దుర్గేష్



ఉప్పాడలో నిర్మిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని ఉప్పాడ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే గర్వించదగ్గ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన రైల్వే అధికారులు

సామర్లకోట: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్ల విస్తరణ పేరుతో వేలాది చెట్లను నరికి వేస్తున్నారని, దాని కారణంగా వాతావరణంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు వేసి వాటిని పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్, రామసుబ్బారావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, రైల్వే సిబ్బంది పాల్గొన్ని రైల్వే పరిసరాలు, చెరువులు వద్ద మొక్కలు నాట్టారు.

పాయింట్ మెన్లకు రైల్వేట్రాక్‌పై శిక్షణ



రైల్వే పాయింట్ మెన్లకు శిక్షణ ఇస్తున్న స్టేషన్ మేనేజరు రమేష్ తదితరులు

సామర్లకోట: రైల్వేలో పాయింట్స్ మేన్‌లు అప్రమత్తంగా ఉండడం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఇటీవల నూతనంగా పాయింట్‌మేన్‌గా విధులు స్వీకరించిన వారికి శనివారం సాయంత్రం ట్రాకుపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలును ఒక లైను నుంచి మరో లైన్‌కు మార్చే సమయంలో పాయింట్‌లలో ఇబ్బందు వస్తే తీసుకోలసిన జాగ్రత్తలను వివరించారు. ఎస్ఎస్ అనంతలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, ప్రిన్సిపాల్ డి.సునీత నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కాకినాడకు చెందిన అంజు అంతర్జాతీయ కంటి ఆసుపత్రి వైద్యులు కళాశాలలోని 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఆసుపత్రి వైద్యురాలు లత ఆధ్వర్యంలో సిబ్బంది సూర్యనారాయణ, ప్రదీప్, విద్యాసాగర్, బాలస్వామి, జయ, చక్రధర్ విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి ఆటల పోటీలు



సామర్లకోట మండల స్థాయిలో జరుగుతున్న బాలికల కబడ్డీ పోటీలు



నియోజకవర్గ పోటీలకు ఎంపికైన కబడ్డీ జట్టుతో పీడీ, పీఈటీలు

సామర్లకోట: మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని బాలురకు నిర్వహించగా శనివారం బాలికలకు నిర్వహించారు. గ్రామ స్థాయిలో క్రీడాకారులకు మంచి వేదికగా ఉపయోగపడుతుందని ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య అన్నారు. ఉత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడా కారులను నియోజకవర్గ, జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రెండు రోజుల పాటు జరిగిన మండల స్థాయి పోటీలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాట్మింటన్, షటిల్ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు నియోజకవర్గ పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు తెలిపారు. క్రీడల పోటీల నిర్వాహక ఇన్‌చార్జిలు ఎం.వెంకటేశ్వరరావు, యార్లగడ్డ బంగారాజు, పీఈటీలు వీరబాబు, ఇబ్రహీం, జయలక్ష్మి, సునైన, శ్రీదేవి, జయలక్ష్మి, అరుణ, వెంకటలక్ష్మి, గోవిందు, సత్యగౌరీ, రాజుశ్వేత, ఎండీవీ ప్రసాద్ పోటీలను నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఉప్పాడ తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న మత్స్యకారులు

సామర్లకోట: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని స్థానిక రాక్ సిరామిక్స్ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రాక్ సిరామిక్స్ అధికారులు, సిబ్బంది శనివారం కాకినాడ బీచ్ ఉన్న వ్యర్థాలను తొలగించి బీచ్ ప్రదేశాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ హెచ్ఆర్ హెడ్ టి.నిరంజన్‌కుమార్, టైల్స్ ప్లాంట్ హెడ్ వినోద వాసుదేవ, శానిటరీ వేర్ హెడ్ చెల్లదురై, జనరల్ మేనేజరు సప్లయ్, చైన్ మేనేజ్‌మెంట్ రాజిందర్‌సింగ్ మాన్, చీఫ్ కౌన్సిల్ ఐఆర్ అండ్ పీఆర్ డాక్టరు శేషగిరిరావు, అకౌంట్స్ హెడ్ నటరాజ్, పర్చేజ్ హెడ్ వెంకటేశ్వరరావు, సేఫ్టీ మేనేజరు బాలాజీ, పీఆర్వో వీజీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో బీచ్‌ను శుభ్రం చేసిన రాక్ సిరామిక్స్ అధికారులు, సిబ్బంది

ఘనంగా తీర పరిశుభ్రత దినోత్సవం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ, అమీనాబాద్ తీర ప్రాంతంలో శనివారం అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఇన్‌కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో తీరాన్ని శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తీర ప్రాంతంలోని చెత్త, వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కిర్లంపూడి: మహిళలు, బాలల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. గెద్దనాపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై మానవ మృగాలు లైంగిక దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. అటువంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిని శిక్షించేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

- నియోజకవర్గ స్థాయికి 29 మంది బాలికల ఎంపిక

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన బాలికలు ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు 29 మంది ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం యు.మీనా మాధురి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల ఫిజికల్ డైరెక్టరు శ్రీదేవి ప్రతిరోజు విద్యార్థులకు క్రీడలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అండర్–14 విభాగంలో కబడ్డీలో ఒకరు, యోగాలో ముగ్గురు, త్రోబాల్‌లో ఇద్దరు, బాస్కెట్ బాల్‌లో నలుగురు, ఖోఖోలో ముగ్గురు ఎంపికయ్యారన్నారు. అండర్–17 విభాగంలో కబడ్డీలో నలుగురు, యోగాలో ఐదుగురు, త్రోబాల్‌లో నలుగురు, బాస్కెట్ బాల్‌లో ఇద్దరు, రన్నింగ్‌లో ఒకరు నియోజకవర్గ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్ఎం మీనామాధురి అభినందించారు.

మృతుల కుటుంబాలను వంగా గీత పరామర్శ



అమీనాబాద్‌లో బడే హల్లెలూయను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను శనివారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత పరామర్శించారు. మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బడే సాహెబ్ ఇటీవల మృతి మృతి చెందగా అతని కుమారుడు బడే హల్లెలూయను, వాకతిప్పలో కుళ్ల వెంకటరమణమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుమారుడు కుళ్ల సతీష్‌కన్నా, వారి కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, అమరవిల్లి సర్పంచ్ పులి జయబాబు, కారే శ్రీనివాస్, ఉమ్మిడి జాన్, బడే విజయ్ కుమార్, గింజాల శ్రీనివాస్, గోపి హరిబాబు తదితరులు ఉన్నారు.


బాల్య వివాహాలను అరికట్టడంలో ‘గురజాడ’ పాత్ర కీలకం



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: బాల్య వివాహాలను అరికట్టడంలో గురజాడ వెంకట అప్పారావు పోషించిన పాత్ర చెరగనిదనిని సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ అన్నారు. గురజాడ 162వ జయంతి సభ శనివారం ప్రజా నాట్యమండలి, పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జీఎన్ మున్సిపల్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సభలో క్రాంతికుమార్ మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి వెలుగుబాట చూపించిన వ్యక్తి గురజాడ వెంకట అప్పారావు అని ఆయన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం నాయకులు ఆర్.వీర్రాజు, మహపాతిన రాంబాబు, డి.సత్యనారాయణ, నేహాలక్ష్మి, సిరిపురపు బంగ్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం



భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలు ఇలా

సామర్లకోట: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సామర్లకోటలో ఉంది. ఈ ఆలయం గోదావరి కాలువ ఆవలి వైపు ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆలయం తెరచి ఉంటుంది. ప్రతి సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు ఆలయం తెరచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు పిఠాపురం మహారాజ గోత్రనామాలతో నిర్వహిస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలు, కార్తిక మాసంలో తెల్ల వారు జామున 4 గంటలకు ఆలయం తెరుస్తారు. మహాశివరాత్రి పర్వదినంలో భక్తులకు 24 గంటలు దర్శనం ఉంటుంది.

సాక్షి - సినిమాలు



సామర్లకోట

అనుశ్రీ 1	భలే ఉన్నాడే
అనుశ్రీ 2	సరిపోదా శనివారం
విఘ్నేశ్వరా	మత్తు వదలరా
పెద్దాపురం	
లలిత 1	35
లలిత 2	గొర్రె పురాణం ఉత్సవం
వీరభద్ర	మత్తు వదలరా
శోభా	మిస్టర్ బచ్చన్